క్లుప్తంగా

లంబాడాలు ఏకతాటిపైకి రావాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): లంబాడాలు ఏకతాటిపైకి రావాలని లబానా సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు రామ్ సింగ్ సూచించారని, ఆయన సూచనల మేరకు మండలంలో ఉన్న అన్ని లంబాడి తండాలలో లబానా సమాజ్ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లబానా యువజన సమాజ్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేస్తూ, పోడు భూముల పంపిణీ, జీవో–245ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రిజర్వేషన్ సాధించే వరకు పోరు బాట పట్టాలని పిలుపునిచ్చారు.

వేములవాడకు బస్సు సర్వీసు



నిజాంసాగర్(జుక్కల్): నారాయణఖేడ్ నుంచి నిజాంసాగర్ మీదుగా వేములవాడ రాజరాజేశ్వర ఆలయానికి బస్సు సర్వీసును పునరుద్ధరిస్తామని నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశం తెలిపారు. బుధవారం నిజాంసాగర్ బస్టాండ్‌ను డిపో అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. ప్రయాణికుల సౌకర్యార్థం కల్హేర్, మాసాన్‌పల్లి, నిజాంసాగర్, ఎల్లారెడ్డి వరకు బస్సు సర్వీసులను నడిపిస్తామన్నారు. ఆయన వెంట మార్కెటింగ్ ఇన్‌చార్జి పాండు, రవీందర్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక అన్నారు. బుధవారం మర్కల్ స్టేజీ వద్ద గల మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఎన్నికల నిర్వహణ తీరు, నాయకత్వ లక్షణాలు, మంచి విలువలను కలిగి ఉండాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రేణుక, అధ్యాపకులు పాల్గొన్నారు.

సన్మానం



రాజంపేట: రాజంపేట ఎస్సైగా ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్సై సంపత్‌ను బుధవారం తలమడ్ల ఎంపీటీసీ నర్మాల రాజు, గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షులు నముండ్ల లింగం, సాయిరెడ్డి శాలువాతో సన్మానించాచారు. ఈ సందర్భంగా మండలానికి ఉన్నత సేవలను అందించి మండల అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్



కామారెడ్డి రూరల్: పీవీ నరసింహారావు పశువైద్య విద్యాలయం (కామారెడ్డి) పరిధిలో గల డెయిరీ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులను అమూల్ సంస్థ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో భాగంగా ఉద్యోగాలు కల్పించింది. సంవత్సరానికి రూ.7 లక్షల ప్యాకేజీతో ఎంపిక చేసుకున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శరత్‌చంద్ర బుధవారం తెలిపారు. హెరిటేజ్, దొడ్ల, లాక్టలీస్, సంఘంలలో సుమారుగా 16 మందికి తక్షణ ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఆయన వివరించారు. తమ కళాశాలలో డెయిరీ టెక్నాలజీ కోర్సు పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి వంద శాతం ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఉద్యోగ నిర్వహణాధికారిణి స్వర్ణలత, ఉమాపతి, రాజగోపాల్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో హోంగార్డుల పూజలు

బాన్సువాడ : హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న హోంగార్డు త్వరగా కోలుకోవాలని బుధవారం బాన్సువాడ డివిజన్‌లోని హోంగార్డులు అయ్యప్ప ఆలయంలో పూజలు చేశారు. హోంగార్డులను పర్మినెంట్ చేయాలని కోరుతూ రవీందర్ అనే హోంగార్డు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడని, ప్రస్తుతం రవీందర్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడని హోంగార్డులు తెలిపారు. త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

గృహలక్ష్మి ఎవరిని వరించేనో?

- కామారెడ్డి మండలంలో వచ్చిన దరఖాస్తులు 864
- సర్వే పూర్తి చేసి ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టిన అధికారులు



ఇస్రోజీవాడిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

కామారెడ్డి రూరల్: సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి కామారెడ్డి మండలంలో మొత్తం 864 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా చిన్నమల్లారెడ్డిలో 110, గర్గుల్‌లో 103, గూడెంలో 100, ఇస్రోజీవాడిలో 73, కోటాల్‌పల్లిలో 24, క్యాసంపల్లి తండాలో 52, క్యాసంపల్లిలో 48, లింగాయిపల్లిలో 48, నర్సన్నపల్లిలో 35, రాఘవాపూర్‌లో 54, శాబ్దిపూర్ లెఫ్ట్‌తండాలో 38, శాబ్దిపూర్‌లో 50, తిమ్మక్‌పల్లిలో 77, ఉగ్రవాయి నుంచి 52 దరఖాస్తులు వచ్చాయి. మండల స్థాయిలో ఆయా గ్రామాల్లోని గ్రామ కార్యదర్శులు పర్యటించి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామాల వారీగా అర్హులను గుర్తించారు.

ఆయా గ్రామాల్లో మహిళ పేరుతో వచ్చి న దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలనే నిబంధన మేరకు దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తుదారు పేరు, తెల్లరేషన్‌కార్డులో నమోదై ఉండాలి. దివ్యాంగులకు 5 శాతం, జనరల్ కోటా కింద 15 శాతం రిజర్వేషన్ వర్తించేలా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పాత ఇల్లు ఉంటే సర్వే సమయంలో ఇంటి పన్ను, కరెంట్ బిల్లు పరిశీలించి, సొంత స్థలం కనీసం ఒక గుంట భూమి పట్టా ఉండే విధంగా చూడాలని గ్రామ కార్యదర్శులకు అధికారులు సూచించారు. ఆగస్టు 17 నుంచి 20 వరకు క్షేత్రస్థాయిలో దరఖాస్తుల వివరాలను పరిశీలించి అర్హులను లబ్ధిదారులుగా ఎంపిక చేసి ఆగస్టు 22వరకు గృహలక్ష్మి పోర్టల్‌లో నమోదు చేశారు.

నేతల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

దేవుడు వరం ఇచ్చినా పూజారి కరుణించి ఇచ్చేనో లేదో అన్నట్టుగా గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసిన లబ్ధిదారులు అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. మరో కొన్ని రోజుల్లో సాధారణ ఎన్నికలు రానుండడంతో ప్రభుత్వం లబ్ధిదారుల ఎంపికను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులకు అప్పగించే అవకాశాలు ఉండటంతో ఆశావహులు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకుంటే తమకు 'గృహలక్ష్మి' దక్కే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు.

పేదోడి సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



ఇల్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌సింధే

నిజాంసాగర్(జుక్కల్): గృహలక్ష్మి పథకం అమలుతో పేదోడి సొంతింటి కలను నిజం చేస్తున్నామని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్ద పీట వేయడంతో పేదోళ్ల కలలు నిజం అవుతున్నాయని పేర్కొన్నారు. బుధవారం జుక్కల్ మండల కేంద్రంలో డబుల్‌బెడ్రూం ఇళ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలతో పాటు పేదల సంక్షేమం ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శివానంద్ పటేల్, జుక్కల్ సర్పంచ్ రాములుసేట్, ఉప సర్పంచ్ భానుగౌడ్, నాయకులు నీలుపటేల్, సాయాగౌడ్, మాధవ్‌రావ్ దేశాయ్, తదితరులు ఉన్నారు.

వంతెనకు నిధుల మంజూరుపై హర్షం



నిజాంసాగర్(జుక్కల్): వాగుపై వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల గున్కుల్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం గున్కుల్ జీపీ వద్ద సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే హన్మంత్ సింధే, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం బ్యాండు మేళాలు, ఆటపాటలతో గ్రామస్తులు పెద్ద ఎత్తున ర్యాలీ నాయకులు మాలీస్ రాజుపటేల్, కాశిరెడ్డి, వెంకాగౌడ్, తదితరులున్నారు.

ఉదయ్‌నిధి స్టాలిన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి



ఆందోళన చేస్తున్న హిందూ సంఘాల నేతలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): సనాతన ధర్మంపై అనుచిత వాఖ్యలు చేసిన ఉదయ్ నిధి స్టాలిన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో ఉదయ్‌నిధి చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఉదయ్ నిధిని అరెస్ట్ చేయాలన్నారు. కుమ్మరి యాదు, చిప్ప రాము, వెంకన్నసేట్, సంతోష్, యోగి, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త!



కళాశాలలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎస్సై గణేశ్

దోమకొండ: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మురళి సూచించారు. బుధవారం ముత్యంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీలను ఇతరులకు చెప్పవద్దన్నారు. ఆన్‌లైన్‌లో సైబర్ మోసగాళ్లు డబ్బులు కాజేస్తారని వివరించారు. హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి జూనియర్ కళాశాలలో..

ఎల్లారెడ్డి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరస్తులు చేసే మోసాల గురించి ఎస్సై గణేష్ వివరించారు. సైబర్ నేరస్తులు చేసే మోసాల గురించి తమ తల్లిదండ్రులతో పాటు, తోటి వారికి వివరంగా చెప్పాలన్నారు. ఏఎస్సై సిద్దిఖీ, తదితరులున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సలీం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల వసతి గృహంలో బుధవారం సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు రాష్ట్ర సమాచార హక్కు పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ సలీం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యా హక్కు చట్టం–2005, బాల కార్మికుల చట్టం అమలు తీరును వివరించారు. సమాచార హక్కు చట్టం యువత చేతుల్లో వజ్రాయుధంలాంటిదన్నారు. ఈ చట్టం ద్వారా సమాజంలో జరుగుతున్న అవినీతిని అరికట్టవచ్చన్నారు. వార్డెన్ రాజేశ్వర్, తెలంగాణ రాష్ట్ర జోనల్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల ముందు తెలియజేయండి



ఏవోతో మాట్లాడుతున్న దరఖాస్తుదారులు

ఎల్లారెడ్డి: మీ–సేవ కేంద్రం కేటాయింపునకు నిర్వహించే పరీక్ష తేదీని రెండు రోజుల ముందు తెలియజేయాలని మీ–సేవ కేంద్రం ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న వారు ఆర్డీవో కార్యాలయ ఏవో సరళాబాయికి విన్నవించారు. బుధవారం అర్హత పరీక్ష నిర్వహిస్తామని సమాచారం ఇచ్చిన తర్వాత అధికారులు పోస్ట్‌పోన్ చేశారు. దీంతో నిరుత్సాహానికి గురైన దరఖాస్తుదారులు ఆర్డీవో కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి సమాచారం లేకుండా అకస్మాత్తుగా పోస్ట్‌పోన్ చేశామని చెప్పడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ఇకనైనా పరీక్ష తేదీకి రెండు రోజుల ముందు సమాచారమివ్వాలని కోరారు.

మున్నూరు కాపు మహిళా కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు సరంపల్లిలో మహిళ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా మున్నూరు కాపు మహిళ అధ్యక్షురాలు బాజా లలిత ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మామిండ్ల మమత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్నూరు కాపు మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.

ఆలయ నూతన కమిటీ..

బీబీపేట: మాందాపూర్‌లోని శ్రీ పాటిమీది అభయాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతర్ల మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రతాప్‌రెడ్డి, లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి, కోశాధికారిగా భాస్కర్‌రెడ్డి, సలహాదారులుగా కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, రాజిరెడ్డి, డైరెక్టర్లుగా బాగారెడ్డి, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, మధుసూదన్‌రెడ్డిలను ఎన్నుకున్నట్లు మోతె రాజిరెడ్డి తెలిపారు.

ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఇంటింటా యజ్ఞం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఇంటింటా యజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం బీజేపీ నాయకులు అశోక్‌రాజ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు లోక మనోహర్ ఇళ్లలో ఆర్య సమాజం ఆధ్వర్యంలో యజ్ఞం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆర్య సమాజ్ సభ్యులు రామస్వామి, సన్నపుల దత్తాత్రేయ, తదితరులు పాల్గొన్నారు.

నేడు షబ్బీర్ అలీ రాక

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లి గ్రామానికి మాజీ మంత్రి షబ్బీర్‌అలీ గురువారం విచ్చేస్తున్నట్లు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు కుప్రియాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి చెరువు నీరు చేరుతోందని, ఈ విషయాన్ని ఆయన దృష్టికి తాము తీసుకెళ్లగా ఆయన గ్రామానికి వచ్చి వీటిని పరిశీలిస్తారన్నారు.

'పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదు'

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీల ఆగ్రహం



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ విజయారెడ్డి

పిట్లం(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదని లేదని, సీజనల్ వ్యాధులు వ్యాపిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ఎంపీవో బ్రహ్మంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిట్లం గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కాలనీలలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్ జొన్న విజయారెడ్డి విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలపై వెంటనే స్పందించాలని ఎంపీపీ కవిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, ఎంపీడీవో వేంకటేశ్వర్‌లు, తహసీల్దార్ రాంమోహన్, మండల పంచాయతీ అధికారి బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజానికి మార్గ నిర్దేశకులు

- మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీపీ

మాచారెడ్డి(కామారెడ్డి): ఉపాధ్యాయులు సమాజానికి మార్గ నిర్దేశకులని మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు అన్నారు. బుధవారం మాచారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గురుపూజోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో గౌరవ మర్యాదలు పొందే వృత్తి ఉపాధ్యాయ వృత్తేనని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 54మందిని శాలువాలతో సన్మానించారు. ఎంఈవో ఎల్లయ్య, ఎంపీడీవో బాలకృష్ణ, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బిచ్కుందలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ మను చౌదరి



రామారెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్‌లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసే పోలింగ్ బూత్‌లను బుధవారం బాన్సువాడ ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. పోలింగ్ బూత్‌లో వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శి నవీన్, సర్పంచ్ మాలెపు నారాయణరెడ్డి ఉన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అచ్చాయపల్లి, జలాల్‌పూర్, ఆత్మకూర్, జప్తిజాన్కంపల్లి గ్రామాల్లోని పోలింగ్‌కేంద్రాలను ఎంపీడీవో రఘు, పోచారం, మాల్తుమ్మెద గ్రామాలలోని పోలింగ్‌కేంద్రాలను ఎంపీవో శ్రీనివాస్ పరిశీలించారు. కార్యదర్శులు రమ్య, మల్లిఖార్జున్, రమేష్, ప్రదీప్, తిరుపతి, నర్సింలు ఉన్నారు.

రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ రోజా, ఇతర అధికారులు ఉన్నారు.

రాజంపేట: పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో బాలకిషన్ ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపు, వీల్ చైర్లు ఉండేలా చూడాలని సూచించారు. ఎంపీవో రఘురాం, డీటీ సంతోష, ఆర్ఐ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద(జుక్కల్): మెక్కా, బిచ్కుందలో బుధవారం అదనపు కలెక్టర్ మనుచౌదరి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మణ్, డీటీ భరత్, ఆర్ఐ సాయిబాబా తదితరులున్నారు.

కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి, తిమ్మక్‌పల్లి, లింగాయిపల్లి, కోటాల్‌పల్లి, నర్సన్నపల్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లలో మౌలిక వసతులను బుధవారం ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంపీవో మలహరితో కలిసి పరిశీలించారు. కార్యదర్శులు మౌనిక, శ్రీనివాస్, అనిల్, గంగుబాయి, నవనీత తదితరులు ఉన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న నాగిరెడ్డిపేట ఎస్సై రాజు

నాగిరెడ్డిపేట/మాచారెడ్డి/ బీబీపేట: హిందూ, ముస్లింలు పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని నాగిరెడ్డిపేట ఎస్సై రాజు,బీబీపేట ఎస్సై సాయిరెడ్డి, మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సూచించారు. బుధవారం వారు ఆయా మండలాల పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో జరుపుకునే మిలాద్–ఉన్–నబీ, వినాయక చవితి పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. గణేష్ మండపాల వద్ద ప్రతిరోజు ఇద్దరూ కాపలా ఉండాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదని ఎవరైనా డీజేలను ఉపయోగిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. పండుగల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మతపెద్దలు చర్యలు చేపట్టాలన్నారు. అల్లర్లు సృష్టించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్హతున్న సంఘాలకు రుణాలు ఇప్పించాలి



మాట్లాడుతున్న డీపీఎం రమేశ్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో ఉన్న అర్హతున్న సంఘాలకు రుణాలు ఇప్పించి, ఆ సంఘాలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని డీపీఎం రమేష్ అన్నారు. తాడ్వాయి ఐకేపీ కార్యాలయంలో బుధవారం వార్షిక మహాసభను ఏర్పాటు చేశారు. పెండింగ్‌లో ఉన్న స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెల 10లోపు చెల్లించిన సంఘాలకు మాత్రమే పావులా వడ్డీ వర్తిస్తుందన్నారు. ఈ సందర్భంగా జీవనోపాధులు, పెరటి తోట పెంపకం, పోషన్ అభియాన్, ఓటరు నమోదు, ఓటు హక్కులపై అవగాహన కల్పించారు. మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా యశోద, ఉపాధ్యక్షురాలిగా మోనాబాయి, తదితరులను ఎన్నుకున్నారు.

సంక్షిప్తం

ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో చిన్నారులకు వైద పరీక్షలు

రాజంపేట: ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషక పదార్థాలను అందించాలని అంగన్‌వాడి టీచర్లకు సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వైద్యులు హరీష్, దివ్యభారతి పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు పెన్షన్ అందజేయాలని వినతి

పిట్లం(జుక్కల్): తమకు పెన్షన్ మంజూరు చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు బీడీ కార్మికులు మండల కేంద్రంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తమకు పీఎఫ్ ఉన్నా బీడీ కార్మికుల పెన్షన్ రావడం లేదని, 2015 నుంచి ఎదురుచూస్తున్నామని వాపోయారు. అధికారులు స్పందించి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలి

లింగంపేట/బీబీపేట: విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవడం వల్ల అనుకున్నది సాధించవచ్చని ఎవరెస్టు శిఖరం అధిరోహించిన మాలావత్ పూర్ణ అన్నారు. బుధవారం ఆమె లింగంపేట, బీబీపేట మండల కేంద్రాల్లోని గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పేదరికం చదువుకు అడ్డు కాదన్నారు. తాను ఎవరెస్టు శిఖరం అధిరోహించడానికి ఎదుర్కొన్న అనుభవాసుల వివరించారు.

ఐటీ సెల్ అసెంబ్లీ కన్వీనర్‌గా శివ శంకర్

బాన్సువాడ: బీజేపీ ఐటీ సెల్, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్‌గా బాన్సువాడకు చెందిన గురుజ శివ శంకర్‌ను నియమించినట్లు అసెంబ్లీ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్ తెలిపారు. పట్టణానికి చెందిన శివ శంకర్ కొన్నేళ్లుగా పార్టీలో చురుకుగా పని చేస్తున్నారని అన్నారు. ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా శివ శంకర్‌కు నియమాక పత్రం అందజేశారు.

సాధన సమితి జిల్లా అధ్యక్షుడిగా గోత్రాల శివ శంకర్

భిక్కనూరు: కామారెడ్డి జిల్లా తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడిగా జంగంపల్లి గ్రామానికి చెందిన గోత్రాల శివశంకర్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బాలుయాదవ్ బుధవారం నియమాకం ఉత్తర్వులను అందజేశారు. శివశంకర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టిన బాల్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడిగా రాజు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడిగా కాడిగె రాజును బుధవారం ఎన్నుకున్నట్లు డివిజన్ నాయకుడు సంజీవులు తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు బాలరాజు తనను లింగంపేట మండల అధ్యక్షునిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి రూరల్: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడి కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడి టీచర్లు సుకన్య, శోభ, సుజాతలు అన్నారు. బుధవారం క్యాసంపల్లి అంగన్‌వాడి కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలకు పోషణ్ మాసోత్సవంలో భాగంగా పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.